www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

ప్రజలకు మంత్రి సుభాష్ దీపావళి శుభాకాంక్షలు


వాసంశెట్టి సుభాష్, మంత్రి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రజలకు, కార్మికులందరికీ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దీపావళి శుభాకాంక్షలను ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీపావళి పండుగను ప్రజలంతా సురక్షితంగా, సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. జీవితమంటేనే చీకటి వెలుగుల సమాహారమని, దీపావళి నేర్పేపాఠం ఇదేనని ఆయన తెలిపారు. ప్రతి ఇంటా ఆనంద దీపాలు వెలగాలని అన్నారు. వెలుగుల పండుగ దీపావళి తెలుగు వారి జీవితాల్లో వేలకాంతులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. బాణసంచా కాల్చేటప్పుడు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ విజ్ఞప్తి చేశారు.

పేలుతున్న బాణసంచా ధరలు

- జిల్లాలో 455 తాత్కాలిక దుకాణాలు
- ప్రతీ మండల కేంద్రంలో వెలుస్తున్న షాపులు
- తయారీ, విక్రయ కేంద్రాల వద్ద కానరాని నిబంధనలు
- రెండు రోజుల్లో రూ.30 కోట్లపైగా అమ్మకాలు


బాణసంచా దుకాణం

ప్రజాశక్తి- రాజోలు

దీపావళి పండుగ వేళ.. జిల్లావ్యాప్తంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. శాశ్వత లైసెన్స్ ఉన్న దుకాణాల్లో బాణసంచా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తాత్కాలిక అనుమతి పొందినవారు దుకాణాలు ఏర్పాటు చేసి.. విక్రయాలకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 270 వస్తువులపై జిఎస్‌టి తగ్గించింది. కానీ జాబితాలో బాణసంచా లేదు. బాణసంచా సామగ్రిపై 18 శాతం జిఎస్‌టి కొనసాగుతోంది. ఈ మేరకు ధరలు గత ఏడాది మాదిరిగా ఉండాలి. కానీ ఈ ఏడాది ధరలు టపాసుల్లా పేలుతున్నాయి. గతేడాదితో పోల్చితే 20శాతం వరకు ధరలు పెరిగాయని వ్యాపా రులు, కొనుగోలుదారులు చెబుతున్నారు.

ధరలు ఇలా..

కాకర పువ్వొత్తులు సాధారకం రూ.150, కలర్స్ అయితే రూ.200, భూచక్రాల సైజు, కంపెనీలను బట్టి ప్యాకెట్ రూ.50 నుంచి రూ.150 పలుకుతోంది. హండ్రెడ్‌వాలా టపాసులు రూ.30-50, విష్ణుచక్రాల బాక్సు రూ.200 నుంచి రూ.250కు విక్రయిస్తున్నారు. చిచ్చుబుడ్లు మట్టితో చేసినవి ఒకటి రూ.30, కంపెనీల చిచ్చుబుడ్లు చిన్నవి బాక్సు రూ.100 నుంచి రూ.200వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. గత ఏడాది లక్ష్మీబాంబుల కట్ట(10) రూ.200 ఉండగా ఈ ఏడాది రూ.600 పలుకుతోంది. తక్కువ నాణ్యతకు చెందిన క్రాకర్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బాణసంచా విక్రయాలకు సంబం ధించి లైసెన్స్ నెంబర్, టిన్ నెంబర్‌తో ఉన్న రశీదుపై బిల్లులు ఇవ్వాలి. కానీ తెల్లకాగితంపై బిల్లురాసి కొనుగోలుదారులకు ఇస్తున్నారు. బిల్లుపై వస్తువు ధర ముద్రణ లేకుండా కొనుగోలు దారులకు మోసం చేస్తున్నారు. కనీసం రూ.2వేలు తీసుకెళితే తప్ప బాణసంచా సామగ్రి వచ్చే పరిస్థితి లేదని వినియో గదారులు పేర్కొంటున్నారు.

తాత్కాలిక షాపులకు అనుమతి...

జిల్లాలో రావులపాలెం, కొత్తపేట, రామచంద్రపుం,రాజోలు ప్రాంతాల్లో మాత్రమే అధికారికంగా అనుమతులు కలిగిన షాపులు ఉన్నాయి. కానీ ప్రతి పట్టణానికి, మండలానికి అనధికారికంగా బాణ సంచా సామగ్రి చేరింది. జిల్లాలో 18 కేంద్రాలు ఏడాది పొడువునా బాణసంచా తయారు చేసే లైసెన్స్ లు కలిగి ఉన్నారు. వీరు ఆర్డర్‌పై మాత్రమే బాణసంచా తయారు చేసి విక్రయించాలి. దుకాణాలకు అమ్మకూడదు. అయితే జిల్లావ్యాప్తంగా ఆదివారం, సోమవారం విక్రయించు కొనేందుకు వీలుగా 455 కిపైగా షాపులకు తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. రాజోలు మండలానికి సంబంధించి 27 షాపులకు అనుమతి ఇచ్చారు.

జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అనుమతులతో కొంతమంది రిటైల్ వ్యాపారులు దుకాణాలకు అనుమతులు తీసు కొని వాటికి వేలం నిర్వహించి వ్యాపారులకు కేటాయిస్తున్నారు. ఒక్కో స్టాల్ ఖరీదు రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు వరకు ఉంది. నలుగురైదుగురు వ్యాపారులు కలిసి ఓ స్టాల్‌ను నిర్వహిస్తున్నారు. వ్యాపా రం పూర్తయ్యాక వీరంతా లాభాలను పంచుకుంటారు. జిల్లాలో 18 మాత్రమే బాణాసంచా విక్రయాలకు శాశ్వత లైసెన్స్ ఉంది. వీరు తప్ప ఎవరూ అమ్మకాలు సాగించేందుకు వీలులేదు. కానీ తాత్కాలిక షాపుల పేరిట అధికారులు అనుమతులు మంజూరు చేస్తున్నారు. వారు రెండు రోజులపాటు బాణసంచా విక్ర యించుకోవచ్చు. అయితే జనావాసాల మధ్య, జాతీయ రహదారుల చెంతనే తాత్కాలిక షాపులు ఏర్పాటు చేస్తుండడంపై కొన్నిచోట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

కానరాని నిబంధనలు

బాణాసంచా విక్రయ, తయారీ కేంద్రాల వద్ద నిబంధనలు పాటించం లేదనే విమర్శలు ఉన్నాయి. మంటలు చెలరేగితే ఆర్పేలా సంబంధిత పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలి. 25వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ఒక సంపు నిర్మించుకోవాలి. డీజిల్, ఇంజను, కార్బన్‌డయాక్సైడ్, ఆక్సిజన్ సిలెండర్లు, పొడి ఇసుకను ఒక డ్రమ్ములో నింపి ఉంచాలి. 15 కిలోలకు మించి మందుగుండు సామగ్రి, నలుగురుకు మించి కూలీలు ఉండకూడదు. అయితే ఇవెక్కడా తయరీ కేంద్రాలు, విక్రయాల వద్ద కనిపించడం లేదు.

ఈ నిబంధనలు తప్పనిసరి..!

నివాసాలకు దగ్గరగా తాత్కాలిక, శాశ్వత బాణసంచా విక్రయ షాపుల ఏర్పాటుకు పోలీసులు అనుమతులు ఇవ్వకూడదు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లకు సమీపంలో, హైటెన్షన్ విద్యుత్ తీగలకు కింద దుకాణాలు పెట్టకూడదు. ఊరికి ఆవల ఏర్పాటయ్యేలా అధికారులు చూడాలి. దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చూడాలి.పొగ తాగరాదనే బోర్డులు ఏర్పాటు చేయాలి. నీటి సదుపాయం కల్పించాలి. డ్రై కెమికల్ పౌడర్ నాలుగైదు కిలోలు, సిఓటు ఐదు కిలోలు దుకాణం వద్ద ఉండేలా చూడాలి.నిబంధనలకు మించి నిల్వలు ఉంచకూడదు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకోకూడదు.అగ్నిమాపకసాధనాలను అందుబాటులో ఉంచాలి.

జిల్లాలో బాణసంచా షాపులు

- తయారీ కేంద్రాలు- 18
- హోల్‌సేల్ షాపులు -15
- రిటైల్ షాపులు(తాత్కాలిక లైసెన్స్ షాపులు) సుమారు - 455

తనిఖీ బృందాలు ఏర్పాటు చేశాం

అనధికారికంగా బాణసంచా నిల్వ చేస్తే చర్యలు తప్పవు. అనుమతులు ఉన్నవారు నిబంధనల మేరకు వ్యాపారాలు చేయాలి. అక్రమంగా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా క్రిమినల్ కేసులు తప్పవు. రాజోలు సర్కిల్ వ్యాప్తంగా ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు చేయడానికి బృందాలను ఏర్పాటు చేశాం. అక్రమ తయారీ, నిల్వ, విక్రయాలపై 112కు సమాచారం ఇవ్వాలి. అవసరమైతే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. **-టి.నరేష్ కుమార్, సిఐ, రాజోలు**

కందుకూరి ఆశయ సాధనకు కృషి

పుస్తకావిష్కరణ సభలో ఎంవిఎస్.శర్మ


ప్రసంగిస్తున్న ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - రామచంద్రపురం

కందుకూరి వీరేశలింగం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ అన్నారు. ఆయన రామచంద్రపురం పట్టణంలో చెలికాన్ రామారావు భవనంలో ఏర్పాటు చేసిన కందుకూరి వీరేశలింగం పంతులు జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసంగించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కందుకూరి వంటి ఉద్యమకారుల అవసరం మరింత ఉందన్నారు. యువశక్తిని సమా జానికి ఉపయోగపడే విధంగా ఉపయోగించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. కుల ప్రాం తీయ తత్వాలు విడిచి దోపిడీ విధానం వ్యతిరేకంగా సమాజానికి అవసరమైన ఉద్యమాలు నిర్మించ వలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా శర్మ వ్యాఖ్యానించారు. అదేవిధంగా 4000 సంవత్సరాల క్రితం వేదాల్లోని విజ్ఞానం నేటికీ అన్వయించటం అవివేకమని విజ్ఞానం నిరంతరం అభివృద్ధి చెందుతూ ఉంటుందని ఆయన విశ్లేషించారు. దీనికి ఉదాహరణగా కరోనా సమయంలో ప్రధాని మూఢత్వంతో వ్యవహరించారని గో కరోనా అంటూ నినాదాలు చేయాలని, గంటలు కొట్టాలని, చప్పట్లు కొట్టాలని దేశ ప్రజలకు సూచించడం ఎంత మూఢత్వము అర్థం అవుతోందని అన్నారు. అదేవిధంగా మహిళలను అణచివేసే విధానాలకు వ్యతిరేకంగా నాడు కందుకూరి వీరేశలింగం చేసిన కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పుస్తక రచయిత పిఎస్.ప్రకాశరావు సిపిఐ నాయకులు డాక్టర్ సి.స్టాలిన్, డాక్టర్ చెలికాని రామారావు, డాక్టర్ సి.కవిత, జన విజ్ఞాన వేదిక నాయకులు, పెదపాటి నరసింహారావు, కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల మాజీ ప్రిన్సిపల్ చల్లా హైమావతి, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ వి.శ్యామ్యూల్, జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మాచిరాజు, వి.సత్యనారాయణ, సిపిఐ నాయకులు వి.గోపాల్ రావు, పి.రాము పాల్గొన్నారు.

21న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఆర్‌టిసి బస్టాండ్ ఆక్రమణలు తొలగించి, తక్షణమే ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21 నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని వామపక్ష, విద్యార్థి, యువజన,మహిళా ప్రజాసంఘాలు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చాయి. నిర్వీర్యమవుతున్న ఆర్‌టిసి బస్టాండ్ ఆక్రమణలు తొలగించి అందరికీ అందు బాటులోకి తీసుకురావాలని అక్టోబర్ 21న మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక సమైక్యాంధ్ర శిబిరం నిరాహార దీక్షా శిబిరంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో అదిక సంఖ్యలో పాల్గొనాలని వామపక్ష నాయకులన్నారు. బస్టాండ్ ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని, లీజును రద్దు చేసి మొత్తం రెండున్నర ఎకరాల బస్టాండ్ స్థలాన్ని స్వాధీనం. చేసుకుని, ప్రయా ణికుల మౌలిక సౌక ర్యాల కల్పనకు నిర్మాణాలు చేపట్టి అందుబాటులోకి తేవాలని, బస్టాండ్ ఆవరణ లోని ఫంక్షన్ హాలును ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, నిర్వహించాలని, బస్టాండ్ ప్రాంతాన్ని ఆక్రమిం చిన లీజు దారుడుపై క్రిమినల్ కేసు పెట్టి శిక్షించాలని, ప్రయాణికులకు తాగునీరు, మరుగు దొడ్లు నిర్మించాలని, బస్టాండ్‌లో మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఆర్‌టిసి సమాచార కౌంటర్‌ను పునః ప్రారంభించి, సిబ్బందిని నియమించాలానే డిమాండ్లతో రౌండ్ టేబుల్ సమావేశం జరుపతలపెట్టినట్లు వామపక్ష నాయకులు తెలిపారు.

రిలే దీక్షకు పలువురి సంఘీభావం

ఆర్‌టిసి బస్టాండ్‌ను పునరుద్ధరించి, బస్సులను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవికుమార్ రిలే దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. రవికుమార్ చేస్తున్న రిలే దీక్షలు ఆదివారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. రవికుమార్ మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండ్‌కు బస్సుల రాకపోకలు పునరుద్ధరించే వరకు దీక్షను విరమించేది లేదని హెచ్చరించారు. రవికుమార్‌కు సంఘీభావంగా యడ్ల చిట్టిబాబు, గిడ్డి ప్రసాద్, నీలం చినబాబు, మెండి కష్ణ బాబు తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎంఎల్‌ఎ


పెదపళ్లలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ బండారు

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం పెదపళ్ళ, పినపళ్ళలలో రూ.1.07 కోట్ల నిధులతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆయన కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఎంఎల్‌ఎ బండారు మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందని అన్నారు.

ప్రారంభించిన అభివృద్ధి పనులు

మండల పరిషత్ నిధులు రూ.10లక్షలతో పినపళ్ళలో సిసి రహదారిరి నిర్మాణం, రూ.35 లక్షల ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు, రూ.5లక్షల గ్రామపంచాయతీ నిధులు కలిపి రూ.40 లక్షలతో పెద పళ్ళలో గ్రామ సచివాలయం నూతన భవనం నిర్మాణం, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో పంచాయతీ గ్రౌండ్, సంత మార్కెట్ స్థల లెవలింగ్ పనుల నిర్మాణం, రూ.15 లక్షల మండల పరిషత్ నిధులతో పెదపళ్ళ నుంచి పినపళ్ళ వరకూ లింక్ గ్రావెల్ రోడ్ నిర్మాణం, రూ.17 లక్షల ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో పల్లె పండుగ సిసి రోడ్ల నిర్మాణం, రూ.10 లక్షల సర్వ శిక్ష అభియాన్ నిధులతో ఎస్‌సి ఏరియాలో పాఠశాల ప్రహరీ నిర్మాణం, రూ.5 లక్షల పంచాయతీ నిధులతో ఒసి, బిసి ఏరియాలో సిసి డ్రెయినేజీ నిర్మాణం, రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో మహిళా మండలి వీధిలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు జరగగా వాటిని వారు ప్రారంభించారు. అనం తరం ఆయా గ్రామాలలో అర్హత పొందిన 17 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను యజమానులకు పసుపు కుంకుమలతో వారికి అందజేశారు. కార్యక్రమంలో ఈదల సత్తిబాబు, సంగీత సుభాష్, దొడ్డ సుబ్బారావు, వంకపట్ల లక్ష్మణరావు, తోరాటి వెంకటేశ్వరరావు, జాస్తి భాస్కరరావు, వంటిపల్లి సతీష్, వంటిపల్లి పాపారావు ,సలాది నాగేశ్వరరావు, కాలా సాయిబాబు, సాదే సత్యనారాయణ, ఎంపిడిఒ రాజు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన అమ్మకు స్వర నీరాజనం


డాక్టర్ చల్లా రవికుమార్ మాతృమూర్తి లక్ష్మి చిత్రపటం వద్ద ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలో ఆలమూరు తాలూక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం నిర్వహించిన 'అమ్మకు స్వర నీరాజనం' కార్యక్రమం ప్రజలను ఆలోచింపజేసింది. పట్టణానికి చెందిన జెవివి నేత, హోమియో వైద్యుడు డాక్టర్ చల్లా రవికుమార్ మాతృమూర్తి లక్ష్మి సంస్మరణ కార్యక్రమంలో భాగంగా అమ్మ పాటల ఆలా పన కార్యక్రమం నిర్వహించారు. అమ్మ గొప్ప తనాన్ని స్పృశిస్తూ పలు జిల్లాలకు చెందిన ఆంధ్ర ప్రజానాట్య మండలి కళాకారులు గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంఎల్‌సి శర్మ హాజరయ్యారు. మానవ సంబంధాలు ప్రతికూలంగా మారిపోతున్న నేటి రోజుల్లో అమ్మను స్మరించుకుంటూ స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించడాన్ని ప్రశంసించారు. నిర్వాహకులు డాక్టర్ చల్లా రవి కుమార్, డాక్టర్ చల్లా మెహర్ ప్రసన్న మాట్లాడుతూ సమాజ గమనంలో అమ్మ పాత్ర అమోఘ మైనదన్నారు. ప్రజా నాట్య మండలి కళాకారులు జగన్, పి.సురేష్, మంగ రాజు, ఐవి, డి.సత్యనారాయణ, ఆర్.వీర్రాజు, ప్రసాద్, ప్రేమానందం, లక్ష్మణ్, రాంబాబు ఆలపించిన అమ్మ పాటలు విశేషంగా ఆలోచింపజేశాయి. నడుస్తున్న కాలంలో పరిస్థితులు ఎంత మారిపోయినా అమ్మ విశిష్టత ఎప్పటికీ సజీవంగా ఉంటుందంటూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన బాధ్యులు దడాల సుబ్బారావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ వర్మ, జిల్లా అధ్యక్షులు పి.సురేంద్ర, ప్రధాన కార్యదర్శి ఎంటివి బి.సుబ్బారావు, సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన బాధ్యులు సత్తిరాజు, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులుగండి స్వామి ప్రసాద్,సామాజిక కార్యకర్తలు, పెద్దింశెట్టి రామకృష్ణారావు, ఎం.గౌరవ్, పి.లెనిన్‌బాబు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రధాన బాధ్యులు డాక్టర్ వల్లూరివీరన్న చౌదరి, డాక్టర్ ఎస్.సూర్యనారాయణ రెడ్డి, డాక్టర్ పాలడుగు చంద్రమౌళి, డాక్టర్ కోలుపాటి జానకిరామ్ చౌదరి, హోమియో వైద్యులు డాక్టర్ ఎం. సుశ్రుత, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు, డాక్టర్ రవికుమార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు


కాపవరం - ఉండూరు రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం


రోడ్డు పనులు పరిశీలిస్తున్న డిఇ సూర్య నారాయణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

గత పదేళ్లగా పాడైపోయి ఉన్నా వెల్ల, ఉండూరు, కాపవరం, మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించారు. రూ 3.50 కోట్లతో ఈ రోడ్డు పనులు గత నెలలో ప్రారంభించారు. సుమారు తొమ్మిది కిలోమీటర్లు పొడవఉండే ఈ రోడ్డు పాడైపోయి పలు ప్రమాదాలు చోటు చేసుకునేవి. ఈ రోడ్డు పనులు వారం రోజుల నుంచి వేగవంతంగా జరుగుతున్నాయి. రోడ్డు పనులను రహదారి భవనాల శాఖ డివిజనల్ ఇంజనీర్ టివిఎస్.సూర్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు. సుమా రు 50 శాతం పనులు పూర్తయ్యాయని త్వరలోనే రోడ్డు పనులు పూర్తవుతాయని ఈ సందర్భంగా డి ఇ సూర్యనారాయణ 'ప్రజాశక్తి' వివరించారు. ఈ రోడ్డు పనులు పూర్తయి తే రామచంద్రపురం నుండి ఉండూరు వెళ్లే ప్రయాణికులకు సులువుగా ఉంటుందని అధికారులు వివరించారు. రోడ్డు పనులు వేగంగా జరగటం పట్ల పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్టూ'నిజం'



ప్రమాదకరంగా ప్రధాన రహదారి


ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతం ఇదే

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మెయిన్ రోడ్డు ప్రమాద భరితంగా తయారైంది. రామచంద్రపురం రాజమహేంద్రవరం మెయిన్ రోడ్‌లో కెవిఆర్ హాస్పిటల్ వద్ద కంకర మట్టితో రోడ్డు కలిసిపోయి ఉంది. దీంతో మెయిన్ రోడ్ నుంచి పక్క రోడ్డుకు వెళ్లే కంకర్ రోడ్డు మెయిన్ రోడ్డుతో కలిసిపోయింది. దీంతో అక్కడ వర్షాలకు కంకర రోడ్డు తడిసి పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరో సమస్య ఇక్కడ రోడ్డుకు మెయిన్ రోడ్డులో టర్నింగ్ ఉండటం వల్ల అనేక మంది వాహనదారులు, బస్సులు, ఆటోలు లారీలు మోటార్ సైకిల్‌లిస్టులు జారి పడి పలు ప్రమాదాల గురవుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ కంకర్ రోడ్డు మరింత జారుడుగా తయారై ప్రమాదాలు మరింత పెరిగాయి. రాత్రి సమయంలో ఈ రోడ్లో ప్రయాణం ప్రమాదకరంగాతయారైంది. నిత్యం ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంటోంది. దీనిపై మున్సిపల్ అధికారులు, రహదారి భవనాల శాఖ అధికారి స్పందించి వెంటనే కంకర్ రోడ్డుకు మెయిన్ రోడ్డుకు ప్రమాదకరంగా ఉన్న ఈ ప్రాంతంలో సరైన చర్యలు చేపట్టాలని రోడ్డు ప్రమాదాలు నివారించాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకుంటే మరిన్ని ప్రమాదాలు జరిగిన తర్వాత చర్యలు చేపట్టినా జరిగే నష్టం వాటిల్లక మానదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


నరసింహారావు (ఫైల్)

ప్రజాశక్తి- మామిడికుదురు

లూటుకుర్రు హైస్కూల్‌లో ఎస్‌జిటిగా విధులు నిర్వహిస్తున్న కాగితాలపల్లి నరసింహారావు(51) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి యుటిఎఫ్ మామిడికుదురు మండల శాఖ సంతాపాన్ని ప్రకటించింది. నరసింహారావు భౌతికకాయానికి డిఇఒ సలీం బాషా, మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నరసింహారావు యుటిఎఫ్‌లో మండల ఆఫీస్ బేరర్‌గా, కుటుంబ సంక్షేమ పథకం బాధ్యులుగా, జిల్లా కౌన్సిలర్‌గా వివిధ స్థాయిల్లో పనిచేశారని వారి సేవలు చిరస్మరణీయమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆయన పనిచేసి అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరు లుగా తీర్చిదిద్దారని అన్నారు. మృతుడు నరసింహారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జిల్లా కుటుంబ సంక్షేమ పథకంలో నరసింహారావు సభ్యుడని, కావున రూ.3 లక్షల వారి కుటుంబానికి త్వరలో అందజేస్తామని అన్నారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో జిల్లా కోశాధికారి సిహెచ్.కేశవరావు, మండల అధ్యక్షులు జి.నాగేంద్ర ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి బి.పెద్దిరాజు, గౌరవాధ్యక్షులు అరవ సుబ్రహ్మణ్యం, కె.అరుణ జ్యోతి, పి.కనకదుర్గారావు, కె.రామ కుమార్, శ్రీనివాసరావు, సూరిబాబు, బి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వైసిపి జిల్లా విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీ, కార్యదర్శుల నియామకం

ప్రజాశక్తి - మామిడికుదురు

వైసిపి విద్యార్థి విభాగం జిల్లా జనరల్ సెక్రటరీగా మొగలికుదురుకు చెందిన కొప్పిశెట్టి హేమ సుందర్, కార్యదర్శిగా పెదపట్నంకు చెందిన బళ్ళ కీర్తి రైనా నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్.జగన్ ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి నియామక ఉత్తర్వులు ఆదివారం వెలువడ్డాయి. తమ నియామకానికి సహకరించిన వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్‌ఎ పాముల రాజేశ్వరి దేవి తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యార్థి విభాగం బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు

నేడు 'పిజిఆర్‌ఎస్' రద్దు

ప్రజాశక్తి - అమలాపురం

దీపావళి పండుగ సెలవుదినం సందర్భంగా ఈ నెల 20వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించడంలేదని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్జీదారులు ఈ యొక్క విషయాన్ని గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు.

19 బాణసంచా దుకాణాలకు అనుమతులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలో దీపావళి పండగను పురస్కరించుకుని 19 బాణసంచా షాపులకు అనుమతులు మంజూరు చేసినట్లు ముమ్మిడివరం తహశీల్దార్ టి.సుభాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల ఆవరణలో 14 బాణసంచా షాపు లకు, ఆనాతవరం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 3 బాణసంచా షాపులకు అలాగే పళ్లవారిపాలెం పంచాయతీ పరిధిలో 2 బాణసంచా షాపులకు అనుమతులు ఇచ్చామని అన్నారు. ఈ షాపుల వద్ద ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు పాటించడంతో పాటు నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. షోపుల యజమానులకు తహశీల్దార్ సూచించారు.

ఆలమూరు మండల పరిధిలో 9 దుకాణాలకు..

ఆలమూరు: మండల పరిధిలో 9 బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ జి.నరేష్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఇందులో కొత్తూరు సెంటర్లో 4, దుకాణాలు ఆల మూరులో 1, చొప్పెల్లలో 1, చెముడు లంకలో 2, మడికిలో 1 గా మంజూరు చేసినట్లు ఆయన తెలి పారు. అనుమతులు పొందిన వ్యాపారులు తమ దుకాణాలను గ్రామ శివారున బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

మహిళకు రూ.15 వేల సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న ఒక మహిళలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.15 వేల సాయం ఆదివారం అందజేశారు. పి గన్నవరం మండలం ముక్తేశ్వరం గ్రామానికిచెందిన జనిపల్లి సంధ్య భర్తను కోల్పోయి పిల్లలతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.15 వేలు చెక్కును తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఇద్దరు పిల్లలకు చదివించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు. పిల్లల చదువుకు తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సహాయానికి మహిళ కృతజ్ఞతలు తెలిపింది.



రామచంద్రపురం పట్టణంలో వెలవెలబోతున్న దుకాణాలు

అంతంత మాత్రంగానే బాణసంచా విక్రయాలు

ప్రజాశక్తి- రామచంద్రపురం

దీపావళి బాణసంచా ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఆదివారం అమ్మకాలు అంతంత మాత్రమే కొనసాగాయి. దీపావళి అనగానే దీపాలతో పాటు బాణసంచా టపాసులు కాల్చుకునేందుకు పిల్లలు పెద్దలు ఎంతో ఉత్సాహం చూపుతారు. దీంతో ప్రతి ఇంటా బాణాసంచా కొనుగోలుకు అధిక మొత్తంలో ఖర్చు పెడతారు. ప్రతి సంవత్సరం దీపావళి బాణసంచా మందులు ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ ఏడాది మరింత ధరలు పెరగడంతో కొనుగోలుదారులు అంతంత మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు ఆదివారం, సోమవారం మాత్రమే అమ్మకాలు కొనసాగించాలని ప్రభుత్వం నిబంధనలు పెట్టడంతో వినియోగదారులు ఈ రెండు రోజులపాటు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఆదివారం ఉదయం వర్షం రావడంతో బాణాసంచా దుకాణాలకు వెళ్లేందుకు జనం సుముఖత చూపలేదు. సాయంత్రం అమ్మకాలు అంతంత మాత్రమే ఉన్నాయని వ్యాపారులు వాపోతున్నారు. ఇక మిగిలిన ఒక్కరోజులో ఎంతవరకు అమ్మకాలు కొనసాగుతాయి అనేది వేచి చూడాల్సి ఉంది.

కపిలేశ్వరపురం: దీపావళి సందర్భంగా ఆదివారం కపిలేశ్వరపురం మండలంలోని అంగర, టేకి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాలు వెలవెలబోయాయి. బాణాసంచా దుకాణదారులకు అధికారులు రెండు రోజులు మాత్రమే తాత్కాలిక లైసెన్సులు జారీ చేశారు. దీంతో రూ. లక్షల్లో పెట్టిన పెట్టుబడి వస్తుందా అనే ఆందోళనలో దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వాతావరణం బెంబేలెత్తిస్తోంది. మరోవైపు గత ఏడాది కంటే బాణాసంచా 3 శాతం పెరగడంతో వినియోగదారులకు ఇబ్బందిగా మారిందని దుకాణదారులు తెలిపారు. కనీసం పెట్టిన పెట్టుబడి వస్తే చాలు అన్న ఆలోచనలో ఉన్నట్లు దుకాణదారులు తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ప్రజాశక్తితో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందని, వారికి వెన్నుదన్నుగా జిల్లా పరిశ్రమల కేంద్రం నిలుస్తోందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సి.హెచ్.గణపతి అన్నారు. జిల్లాలో సుమారు 13,681 వరకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, నూనె శుద్ధి, టైల్స్ తయారీ, రైస్ మిల్లింగ్, ఆహార శుద్ధి, ప్యాకేజింగ్, వ్యవసాయ ఆధారిత, మత్స్య ఆధారిత ఉత్పత్తులు, ఆటోమొబైల్, ఇంజినీరింగ్ ఫ్యాబ్రికేషన్ మొదలగు రంగాలలో స్థాపించి ఉన్నాయన్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతిపై ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వివరించారు.

2025-2026 సంవత్సరంలో పరిశ్రమల లక్ష్యం ఎంత..?

జిల్లాలో ఇప్పటివరకు అన్ని పరిశ్రమలు స్థాపించబడి సుమారు 50 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 61 పెద్ద, భారీ తరహా పరిశ్రమల ద్వారా మరో 38,500 మందికి ఉపాధి కల్పిస్తూ స్థూల దేశీయోత్పత్తిలో తమ వంతు భాగాన్ని అందిస్తున్నాయి. సిఎం నిర్దేశించిన దాని ప్రకారం ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త అనే లక్ష్యంతో జిల్లా పరిశ్రమల కేంద్రం వివిధ కేంద్ర, రాష్ట్ర పథకాలు అమలు పరిచేందుకు కృషి చేస్తుంది.

పిఎం ఉపాధి కల్పన పథకంతో ఎంత మేలు..?

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామాలు, పట్టణాల్లోని నిరుద్యోగ యువత వివిధ పారిశ్రామిక వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకొనేందుకు వాళ్ళు తీసుకున్న రుణాలపై 35 శాతం, 25 శాతం సబ్సిడీ కల్పిస్తున్నారు. అలాగే గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరం కలిపి మొత్తం 221 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు.

పిఎం విశ్వకర్మ పథకం అంటే ఏమిటి..?

పిఎం విశ్వకర్మ పథకం ద్వారా వివిధ కుల వృత్తుల వారికి లబ్ది చేకూర్చే విధంగా కృషి చేస్తున్నాము. వాటికి సంబంధించి 722 దరఖాస్తులను ఇప్పటికే స్వీకరించాం.

ర్యాంప్ పథకం అంటే ఏమిటి..?

ఎంఎస్ఎంఇల పని తీరును మెరుగు పరచడం, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే పథకాన్ని ప్రకటించింది. మన రాష్ట్రంలో ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షణలో ఉద్యమ్ అవగాహన సదస్సులు, జెడ్ సర్టిఫికేషన్ సదస్సులు, ఎంఎస్ఎంఇ కాంపిటేటివ్ లీన్ స్కీమ్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎంఎస్ఎంఇల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న వివిధ ప్రోత్సాహకాలు, వాటికి ఉండే ప్రయోజనాలు వివరించడమే ఈ ర్యాంప్ పథకం లక్ష్యం.

ఉద్యమ్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారా..?

జిల్లాలో ఇప్పటి వరకు 27 ఉద్యమ్ అవగాహన సదస్సులు వివిధ మండలాల్లో నిర్వహించాం. ఇంకా పలు ప్రాంతాలలో ఏర్పాటు చేస్తాం. వీటి వల్ల వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందేందుకు, బ్యాంకు రుణ సదుపాయాలు, ఎంఎస్ఎంఇల డిలేడ్ పేమెంట్లను సమాధాన పోర్టల్ ద్వారా పరిష్కరించుకోవడం వంటి ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరిస్తున్నాము.

నూతన పరిశ్రమల స్థాపనకు చర్యలు..?

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, నిబంధనలను క్రమబద్ధీకరించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, వ్యాపారాల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విధానం-2024-29, ఎంఎస్ఎంఇ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ-2024-29, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ-2024-29లను అమలు చేస్తుంది. ఈ నేపథ్యంలో పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది.

ఏకగవాక్ష విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారా..?

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏక గవాక్ష విధానం కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులను త్వరితగతిన అనుమతులు కల్పించేలా కలెక్టర్ సూచనలు మేరకు కలిసి పని చేస్తున్నాం. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా కృషి చేయడం జరుగుతుంది. జిల్లాలో పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది. కాకినాడ జిల్లా భౌగోళిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయుక్తంగా ఉంటుందో వాటిని ప్రోత్సహించడం జరుగుతుంది.

సంత రహదారిలో ట్రాఫిక్ అవస్థలు

ప్రజాశక్తి - పెద్దాపురం



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు

స్థానిక కుమ్మర వీధిలోని సంత మార్కెట్ రహదారిలో సంత జరిగే ప్రతి ఆదివారం తీవ్ర ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు, కొనుగోలుదారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంత మార్కెట్‌ను ఆనుకునే కుమ్మరి వీధి సెంటర్ నుంచి సామర్లకోట-ప్రత్తిపాడు రహదారికి వెళ్లే రోడ్డు ఉండటంతో ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ రహదారి మీదిగానే వెళుతుంటాయి. దీనికి తోడు ఈ రహదారిలో అనేక పరిశ్రమలు, మండల పరిధిలోని ఏటిపట్టు గ్రామాలు ఉండటంతో ప్రతిరోజు వాహనాలపై వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈ సంత మార్కెట్ ఎదురుగానే శ్మశానం ఉండటంతో ఆదివారం రోజున శ్మశానానికి వెళ్ళవలసి వస్తే ఈ ట్రాఫిక్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రోజున ఈ రహదారిని ఆనుకుని సంత వ్యాపారాలు జరగడంతో ట్రాఫిక్కుకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు దీనిని గమనించి ప్రతి ఆదివారం ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు నిరాశ : కురసాల

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



మీడియాతో మాట్లాడుతున్న కురసాల

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులతోపాటు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర నిరాశే ఎదురైందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు చేయలేక పోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలలో విద్య, వైద్య రంగాలతో పాటు అన్ని రంగాలను గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డి ఎ ప్రకటించి పండగ చేసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడే కార్పొరేట్ ఆసుపత్రులు వారం రోజులుగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలను నిలిపివేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం దారుణమన్నారు. రైతులకు ఇస్తానన్న బీమా డబ్బును ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. అలాగే ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజ్ రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాలలో పిహెచ్‌సి, సిహెచ్‌సి డాక్టర్లు 15 రోజులుగా విధులకు వెళ్లకుండా సమ్మె చేస్తున్నారని, దీంతో గ్రామ స్థాయిలో ప్రజలకు ఆరోగ్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేసి ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు అందకుండా చేయడం ప్రజల హక్కులను కాలరాయిడమేనన్నారు. ఫన్షనర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి మాజీ ఉద్యోగులను మోసం చేశారని అన్నారు. గతంలో వేసిన పిఆర్‌సి కమిషన్ ఛైర్మన్‌ని వెలగొట్టి పిఆర్‌సి ప్రస్తావన లేకుండా ఉద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరూ ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో షాపుల వద్ద వ్యాపారులు

వర్షంతో కుదేలైన బాణసంచా వ్యాపారులు

ప్రజాశక్తి - సామర్లకోట, ఏలేశ్వరం

పలు చోట్ల కురిసిన కుండపోత వర్షంతో బాణసంచా వ్యాపారులు దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడ్డారు. సామర్లకోట పట్టణంలోని బడేలమ్మ చెరువు ఎదురుగా రోడ్డుకి ఇరువైపులా 14 బాణసంచా దుకాణాలు ఏర్పాట్లు చేశారు. దీపావళికి ఒకరోజు ముందు కురిసిన భారీ వర్షంతో బాణసంచా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే ఏలేశ్వరంలో కురిసిన వర్షం బాణాసంచా వ్యాపారులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. శనివారం సాయంత్రం టెంట్లు వేసి మందు గుండు సామాగ్రిని తరలించుకున్న వ్యాపారులకు ఆదివారం వచ్చి చూసేసరికి ఏర్పాటు చేసిన టెంట్లు వర్షం ప్రభావంతో కూలిపోయాయి. వర్షం పడడంతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, వర్షం ప్రభావంతో తీవ్రంగా నష్టపోయామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

దీపావళి పండుగను ప్రజలు సురక్షితంగా జరుపుకోవాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఆదివారం ఆయన సామర్లకోటలోని దీపావళి బాణసంచా విక్రయ దుకాణాలను పరిశీలించారు. చిరు వ్యాపారుల కోసం త్వరలోనే ఒక మార్కెట్ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఈ పర్యటనలో కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, మలిరెడ్డి దుర్గాప్రసాద్, భీమేశ్వర ట్రస్ట్ బోర్డు మెంబర్ తాతపూడి అరుణ్‌వంశీ, మండల టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి శ్రీరాములు, మండల తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - జగ్గంపేట



50 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మండలంలోని కాండ్రావులపల్లి జడ్‌పి హైస్కూల్లో చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆదివారం 65 ఏళ్ల వయసులో 15 ఏళ్ల యువకుల్లా సందడి చేశారు. 1970 - 75 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు కాండ్రావులపల్లి కళ్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ కలయికగా కలుసుకున్నారు. సుమారు 50 ఏళ్ల తరువాత కలుసుకుని గత తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వృద్ధాప్య దశకు చేరుకుని ఎక్కడెక్కడో స్థిర పడిన వారు సైతం వచ్చి ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉత్సాహంగా గడిపారు. అనంతరం పలువురిని సాలువాలు, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాండ్రావులపల్లి నీటి సంఘం అధ్యక్షులు కంటే రామారావు, సర్పంచ్ పిట్ట సుగుణ రావు, షేక్ జిన్నా, కొంగర వెంకటనారాయణ, ఏలేటి పద్మ ప్రసాద్, జల్లంగి వీరభద్రరావు, కష్ణ ప్రసాద్, వెంకట్రావు, దేవ గుప్తాపు, వెంకట్రావు, హై స్కూల్ హెచ్‌ఎం తాతపూడి వెంకటరమణ తో పాటు పూర్వ విద్యార్థులు 75 మంది పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న యాదవ సంఘీయులు

చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

ప్రజాశక్తి - యానాం

చట్టసభల్లో యాదవులకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యాదవ మహాసభ కోరింది. ఆదివారం స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఎపి అఖిల భారతీ యాదవ మహాసభ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, పుదుచ్చేరి అధ్యక్షుడు మట్టా సురేష్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి నుర్తు నరేంద్రయాదవ్ మాట్లాడుతూ 70 ఏళ్లుగా 50 శాతంగా ఉన్న బిసి జనాభాకు సమానమైన రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా పాలకులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా శాస్త్రీయంగా నిర్ధారణ చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో సైతం స్థానిక సంస్థల్లో 46 శాతం రిజర్వేషన్లు అమలుకు నిర్ణయం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షలుగా ఉన్న యాదవులకు వచ్చే ఎన్నికల్లో 25 అసెంబ్లీ, 5 ఎంపి సీట్లు కేటాయించాలని తీర్మానించారు. యాదవ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలని, అమరావతిలో యాదవుల వసతికోసం యాదవభవన్ నిర్మాణం, పశువులకాపరుల పిల్లల విద్యకై గురుకుల పాఠశాల, టిటిడి దేవస్థానంలో యాదవులకు మఠం నిర్మాణం, పాలక మండలిలో సభ్యుడిగా నియామకం చేయాలని తీర్మాణించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి రామారావు, నాయకులు రామచంద్రయాదవ్, కుండల సాయికుమార్ యాదవ్, కోన గురవయ్య, పెనుగొండ దుర్గబాబు, మట్టా పుల్లారావు, పుట్టి ఏడుకొండలు, ఏసుబాబు, మొండి సత్యనారాయణ, వీరబాబు, గంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిబాబును కలిసిన శివకుమార్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



గిరిబాబుకు కృతజ్ఞతలు చెబుతున్న శివకుమార్

వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును ఆర్‌టిఐ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన లింగంపల్లి శివకుమార్ ఆదివారం కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం



అన్నదానాన్ని పర్యవేక్షిస్తున్న ఎసి విజయలక్ష్మి

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామ చంద్రప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, శివ, వరహాలు సేవలందించారు.



జొన్నాడ ఫ్లైఓవర్ దుస్థితి

న్యాయం చేయాలని ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి - కరప



మహిళలతో మాట్లాడతున్న ఎంఎల్ఎ నానాజీ

మండలంలోని కూరాడ గ్రామానికి చెందిన డ్వాక్రా రుణాల వ్యవహారంలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి న్యాయం చేయాలని పలువురు మహిళలు ఎంఎల్ఎ పంతం నానాజీని కోరారు. ఎంఎల్ఎ కార్యాలయంలో ఆదివారం ఎంఎల్ఎను డ్వాక్రా మహిళలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రుణాలు చెల్లింపులు చేశామన్నా బ్యాంకు నమోదు కాలేదని, బిసి పాయింట్ వద్ద చెల్లించిన సొమ్ములకు చేతితో రాసిన రసీదులు మాత్రమే ఇచ్చారన్నారు. ఇందుకు కారుకులైన వారి వద్ద నుంచి సొమ్ములు రికవరీ చేసి లబ్ధిదారులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కరిస్తానని ఎంఎల్ఎ వారికి హామీ ఇచ్చారు.

నిలిచిన జొన్నాడ ఫ్లయ్ఓవర్ నిర్మాణం

- ప్రస్తుత కాంట్రాక్ట్ సంస్థ రద్దు
- మళ్లీ టెండర్లకు పిలుపు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- త్వరితగతిన పూర్తిచేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆలమూరు

ఎన్నో ఏళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న ఆలమూరు మండలం జొన్నాడ ఫ్లయ్ఓవర్ నిర్మాణ కాంట్రాక్ట్ రద్దు అయింది. ఫ్లయ్ఓవర్ నిర్మాణ పనులు జాప్యం వల్ల వాహనదారులు పడరానిపాట్లు పడుతున్నారు. దీనిపై కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్‌లు ఎన్నిసార్లు జిల్లా స్థాయిలో సమీక్ష జరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. పని చేయని ఆ కాంట్రాక్ట్ సంస్థను రద్దు చేయాలని సిఎం ఆదేశించారు. దీనిపై ఆ కాంట్రాక్ట్ సంస్థ కు నోటీసు ఇవ్వగా ఈ నిర్మాణ పనుల నుంచి ఆ సంస్థ తప్పుకోవడానికి సిద్ధమని లిఖిత పూర్వకంగా రాసిచ్చింది. దీంతో ఎలాంటి లీగల్ సమస్య లేకుండా వచ్చే నెలలో మళ్లీ టెండర్లు పిలిచి వేరే కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించడానికి నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ఫ్లయ్ఓవర్ ఫిల్లర్స్ పూర్తయ్యాయి. గడ్డర్స్ కూడా నిర్మించి సిద్ధంగా ఉంచారు. వాటిని పిల్లర్స్‌పై పెట్టి స్లాబ్ వేస్తే సరిపోతుంది. అదేవిధంగా అప్రోచ్ రోడ్ వాల్ కి అవసరమైన కాంక్రీట్ దిమ్మలు కూడా జొన్నాడ శివాలయం ఆవరణలో తయారుచేసి సిద్ధంగా ఉన్నాయి. పాత కాంట్రాక్ట్ సంస్థకు ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లించి కొత్త కాంట్రాక్ట్ కొనసాగించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఏళ్ళ తరబడి ఈ ఫ్లయ్ఓవర్ నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల వాహనదారులు ఇటుగా వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 2022 సెప్టెంబరు 22న జాతీయ రహదారులు, రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజమహేంద్రవరం వచ్చి ఈ ప్యాకేజీకి శంకుస్థాపన చేశారు. ఇదే ప్యాకేజీ లో ఉన్న మోరంపూడి ఫ్లయ్ఓవర్ ప్రారంభించి ఏడాది అవుతున్న నిర్మాణం మాత్రం ముందుకు సాగలేదు. కొత్త కాంట్రాక్ట్ సంస్థ ద్వారా పనులు వేగవంతంగా జరగడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడతారని ప్రయాణికులు కోరుతున్నారు.